చెరువులకు పండగొచ్చింది!

- ఉపాధి నిధులతో తవ్వకం పనులు
- 370 ఎకరాలకు సాగు నీరు
- పెరగనున్న భూగర్భ జలాలు

పల్లెల్లో నీటి వనరులను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 'అమృత్ సరోవర్'పథకాన్ని ప్రవేశ పెట్టింది. దీని ద్వారా చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. ఈ చెరువుల్లో నీరు చేరుతుంది. దీంతో చెరువు కింద భూములకు సాగునీరు అందుతుంది. చెరువుల్లో తీసిన మట్టిని పొలాల్లో వేయడం వలన భూములు సారవంతమైన అధిక దిగుబడులు ఇస్తాయి.

'అమృత్ సరోవర్'తో చెరువుల మరమ్మతులు



గార్లఒడ్డు పంచాయతీలోని ఎర్రచెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఏన్కూరు: మండలంలో చెరువుల్లో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అమృత్ సరోవర్ కింద మండలంలోని ఐదు పంచాయతీల్లో ఐదు చెరువులను గుర్తించారు. జన్నారం ఎస్టీకాలనీ పంచాయతీలోని డోలోరికుంట, ఏన్కూరు పంచాయతీలోని ఊరచెరువు, గార్లఒడ్డులో ఎర్రచెరువు, తిమ్మారావుపేటలో కొమ్మిన్నిభిక్షం కుంట, గంగుల నాచారంలో కుసిందేవి కుంట చెరువులను ఎంపిక చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ చెరువుల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. చెరువుల్లో తవ్విన మట్టిని ట్రాక్టర్ల ద్వారా పొలాలకు తరలిస్తున్నారు.

పంచాయతీల్లోని చెరువుల వివరాలు..

జన్నారం ఎస్టీకాలనిలో చెరువు కింద 100 ఎకరాలు, ఏన్కూరులోని చెరువు కింద 100 ఎకరాలు, గంగుల నాచారంలోని చెరువు కింద 50 ఎకరాలు, గార్లఒడ్డు చెరువు కింద 80 ఎకరాలు, తిమ్మారావుపేట చెరువు కింద 40 ఎకరాలు భూములు ఉన్నాయి. చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం వలన వర్షం నీరు చెరువుల్లో నిల్వ ఉండి సాగునీటికి ఉపయోగ పడతాయి. దీంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండడం వలన భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. ఈ చెరువుల్లో పనులు పూర్తి అయిన తరువాత మిగత చెరువులను కూడా అభివృద్ధి చేయనున్నారు.

ఐదు చెరువుల్లో పనులు జరుగుతున్నాయి..



మండలంలో అమృత్ సరోవర్ కింద ఐదు చెరువులను ఎంపిక చేశారు. గార్లఒడ్డు, ఏన్కూరు, జన్నారం, తిమ్మారావుపేట, గంగుల నాచారం పంచాయతీల్లో ఐదు చెరువుల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. ఉపాధి కూలీల ద్వారా ఈ పనులు చేపట్టాం.

– బయ్యారపు అశోక్, ఎంపీడీఓ, ఏన్కూరు

రండి.. ప్రభుత్వ కాలేజీల్లో చేరండి

ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం అధ్యాపకుల క్యాంపెయిన్



కల్లూరులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కుతుంబాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధ్యాపక బృందం శుక్రవారం క్యాంపెయిన్ ప్రారంభించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో పదో తరగతి విద్యార్థులు, వారి తలిదండ్రులతో మాట్లాడుతూ.. కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోదన అందిస్తున్న అధ్యాపకులు, కళాశాలలో ఆధునిక ల్యాబ్‌లు, సెమినార్ హాల్, ప్రత్యేకించి లైబ్రరీ, విశాలమైన క్రీడా ప్రాంగణం, పచ్చదనంతో కూడిన ఆవరణ, ఎన్ఎస్ఎస్ సర్వీస్ తదితర సౌకర్యాలతో పాటు విద్యార్థులకు స్కాలర్ షిప్ కూడా అందుతుందన్నారు. ఉచితంగా అకడమిక్ పుస్తకాలను అందిస్తున్నారని గ్రామాల్లోని గడప గడపకు తిరుగుతూ.. వివరాలు తెలియపరుస్తూ ప్రభుత్వ కాలేజీలో చేరేలా కృషి చేస్తున్నారు. ఈ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ విభాగాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎస్‌కే అత్తాహర్ అలీ, కె.శ్రీనివాసరావు, కోట కిరణ్‌కుమార్, బి.వీరభద్రం, జి.జ్యోతి, శ్రీరాములు, పుల్లారావు తదితరులు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు.

సీఎం కప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శిరీష, జెడ్పీటీసీ కవిత

ఎర్రుపాలెం: ఈ నెల 22న ఖమ్మంలో నిర్వహించిన సీఎం కప్ ట్రోఫీలో భాగంగా ఎర్రుపాలెం మండలానికి చెందిన క్రీడాకారులు కబడ్డీ, ఖో-ఖో క్రీడల్లో పురుషులు, మహిళలు విభాగాల్లో జిల్లా స్థాయిలో తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. కాగా గెలుపొందిన విజేతలకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, తహసీల్దార్ ఎస్.తిరుమలచారి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎస్సై ఎం.సురేష్‌లు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పీడీ చిన్ని విజయరాజ్, పీఈటీలు మారాబత్తుల జమలయ్య, జీవీ సత్యనారాయణ రెడ్డి, నాగేశ్వరరావు, త్రిపుర, బీమా, సాంబశివారెడ్డి, తదితరులున్నారు.

క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రవాణాశాఖ కార్యాలయం వద్ద ఆర్టీఏ, ఆర్టీసీ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. గూడ్స్, ప్యాసింజర్, ట్రావెల్స్ వాహనాలను తనిఖీలు చేసి సరైన ధ్రువపత్రాలు లేని వారికి జరీమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ ఎస్.వెంకటపుల్లయ్య, ఆర్టీసీ ఎస్ఎం గడ్డం శ్రీనివాసరావు, కె.వి.రావు, కరుణాకర్ పాల్గొన్నారు.

ఏపీజీవీబీ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు

ఎర్రుపాలెం: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండలంలోని సఖినవీడు గ్రామంలో రైతులు, ఈజీఎస్ కూలీలతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని, అలా చెల్లించడం వల్ల చేకూరే ప్రయోజనాలను వివరించారు. బీమా పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ భాస్కరరెడ్డి, మోహన్‌రావు, విజయ్ తదితరులు ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్ కుమార్

పెనుబల్లి : వేసవిలో ఓఆర్ఎస్, జింకుతో నీళ్ల విరోచనాలను అరికట్టవచ్చునని లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని సూరయ్యబంజర్ తండాలో శుక్రవారం తీవ్రమైన విరోచనాల నివారణ పక్షోత్సవాల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విరోచనాలకు గురైన వారు తరచూ ఓఆర్ఎస్ నీటిని కలిపి తాగాలని, చిన్నపిల్లలకు తల్లిపాలలో జింక్ టాబ్లెట్లు కలిపి 14 రోజులు పాటు అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాశ్, ఏఎన్ఎంలు ఉన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు..



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్యాంబాబు

వైరారూరల్: బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని కంటి వైద్యుడు వుంద్రా శ్యాంబాబు అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో శుక్రవారం కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహకారంతో ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన వార్షికోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కిరాల రామదాస్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో శ్యాంబాబు పాల్గొని మాట్లాడారు. ఎవరైనా బాల్యవివాహాలు చేసిన ట్లైతే చైల్డ్ లైన్ డిపార్ట్‌మెంట్ నంబర్ 1098కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న బ్రహ్మకుమారి రాధిక

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కకర్లపల్లిరోడ్డులో బ్రహ్మకుమారీస్ సత్తుపల్లిశాఖ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పలువురు ప్రయాణికులకు, పాదాచారులకు మజ్జిగను బ్రహ్మకుమారి రాధిక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి రాధిక, శ్రీలక్ష్మి, అరుణ్, పాకాల రవి, ప్రమీల, పాకాల ప్రసాద్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సత్తా చాటండి



ఎర్రుపాలెంలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఏన్కూరు/ఎర్రుపాలెం: ఖమ్మంలో ఈ నెల 27న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరరావు, ఆపార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు నూతక్కి నర్సింహారావు, మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావులు కోరారు. శుక్రవారం ఏన్కూరులో బీజేపీ సమావేశం నిర్వహించారు. ఎర్రుపాలెంలో నిరుద్యోగ మార్చ్ విజయవంతం చేయాలని ఇంటింటికి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సభలో నిరుద్యోగుల సత్తా ఎంటో చూపించాలన్నారు. అవినీతి, లికేజ్, లిక్కర్ మాఫియా, కుటుంబ పాలనను అంత మొందించటం కోసం నిరుద్యోగులు, విద్యార్థులు, యువతి యువకులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు నిరుద్యోగ మార్చ్‌కు కదిలివచ్చి విజయవంతం చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, పరీక్షలు రాసిన నిరుద్యోగులకు రూ.లక్ష చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్ల మోతుల రమేష్, గుగులోత్ శశికిరన్, చింతనబోయిన రాందాస్, గుగులోత్ రాములు, బానోత్ కిషన్, దేవరకొండ కోటేశ్వరరావు, మిర్యాల నాగేశ్వరరావు, కోటపాటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు తీసుకోవాలి



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: మండలంలో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు బిల్లు తీసుకోవాలని వ్యవసాయాధికారి ఏ.నర్సింహారావు కోరారు. మండల కేంద్రంలో విత్తన దుకాణాలను టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వస్తున్నటువంటి నకిలీ విత్తనాల జాగ తెలపాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రామారావు, హెడ్‌కానిస్టేబుల్ గని పాషా తదితరులు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

పెనుబల్లి : మండలంలో విద్యా సంస్థలు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపులేని విద్యా సంస్థల్లో తమ పిల్లలను చేర్పించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పెనుబల్లి గ్రామంలో రమేష్ హై స్కూల్‌కు ఇప్పటి వరకు ప్రభుత్వ అనుమతి లేదని, గుర్తింపు లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామని, అనుమతులు ఉన్న పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించుకోవాలని తెలిపారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



మేడేపల్లిలో ఆయుర్వేద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏన్కూరు: ఆయుర్వేదం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయుర్వేద వైద్యాధికారి జి.శంకర్ తెలిపారు. మండలంలోని మేడేపల్లిలో శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, వృద్ధులతో పాటు అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేదంలో అన్ని రకాల రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగారత్నం, గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాద్, ఆయుర్వేద సిబ్బంది అరుణ, శైలజ పాల్గొన్నారు.

3న ఉమ్మడి ఖమ్మం జిల్లా సదస్సు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తల్లాడ: తల్లాడ ఆర్‌బీ గార్డెన్‌లో జూన్ 3న ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలికూర వెంకటేశ్వర్లు, ఎమ్మెస్పీ ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. శుక్రవారం ఆర్‌బీ గార్డెన్‌లో జరిగిన ఎమ్మెస్పీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా సదస్సుకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అశోక్, బలరాం, భద్రం, రవి, వీరబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి



కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న సంభాని చంద్రశేఖర్, తదితరులు

పెనుబల్లి : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని మర్లకుంట, కేయంబంజర్ గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పది లక్షల వరకు వడ్డీలేని రుణ సదుపాయం, ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం తెలంగాణ యువతకు రిజర్వేషన్, రూ.4 వేల నిరుద్యోగ బృతి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజబాబు, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మనోహర్‌నాయుడు, కాంతయ్య, దేవేంద్రబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వైరా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దివంగత సీఎం ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ప్రకటించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం వైరాలో టీడీపీ మినీ మహానాడు, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, బసవతారకం చిత్ర పటాలతో వైరాలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి కృషి చేసిన మహాను భావుల్లో ఎన్టీఆర్ ఒకరన్నారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో టీడీపీ పోటీలో ఉండటం ఖాయమన్నారు. వైరా నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిని నిలబెడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కనగాల సాంబశివరావు, జిల్లా పార్లమెంట్ కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు, నాయకులు చలపతిరావు, వివిధ మండలాల అధ్యక్షులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ



బస్‌పాస్‌లు అందిస్తున్న సర్పంచ్ సునీత

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ బస్‌పాస్‌లను గ్రామ సర్పంచ్ సునీత శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఆదేశాలతో రాయితీతో కూడిన బస్సు పాస్‌లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రవీంద్రనాద్, భుజంగరావు, ఐఈఆర్పీ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి చెవుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌మేళా..

సత్తుపల్లిటౌన్: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆదివారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వీరపనేని బాబి, కౌన్సిలర్ వీరపనేని రాధిక తెలిపారు. సత్తుపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులకు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని సత్తుపల్లి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి 50 శాతం రాయితీతో కూడిన బస్‌పాస్‌లను ఉచితంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో అందిస్తామని తెలిపారు. సదరం సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, ఒక ఫొటో తెచ్చినట్లైతే ఉచితంగా బస్‌పాస్‌లు పొందవచ్చుని తెలిపారు. ఈ పాస్‌లతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో 50శాతం రాయితీతో ప్రయాణించవచ్చని, సత్తుపల్లి మండల పరిధిలోని అర్హులైన దివ్యాంగులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు తిమ్మారావుపేటలో..

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేటలో దివ్యాంగులకు శనివారం ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓం ఆదిత్యగాయత్రి పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఉచిత బస్‌పాస్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన శీలం వెంకటేశ్వరరెడ్డి కుటుంబాన్ని శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంటవీరయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంభ సభ్యులను ఆయన ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, లక్ష్మీపురం సర్పంచ్ సీతారామిరెడ్డి, ఉప సర్పంచ్ ముత్తారెడ్డి పాల్గొన్నారు.

4న సీపీఐ బహిరంగ సభ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కొణిజర్ల: జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని అమ్మపాలెం, చిన్నగోపతి, పెద్దగోపతి, పెద్ద మునగాల, తనికెళ్ల, తుమ్మలపల్లి, అన్నవరం రామనర్సయ్యనగర్, మల్లుపల్లి గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, నాగభూషణం, రాంబాబు, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, సత్యం, శ్రీను, బాలాజీ, వెంకన్న పాల్గొన్నారు.

మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

కారేపల్లి: తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ గడువును ప్రభుత్వం ఈ నెల 30 వరకు పొడిగించినట్లు కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మహ్మద్ అక్తర్ తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌ల్లో 40 సీట్ల చొప్పున 160 సీట్లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం కలదన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో WWW.TSMODELSCHOOL.COM లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టైలర్ హబీబ్ వర్ధంతి వేడుకలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సీనియర్ టైలర్ హబీబ్ వర్ధంతి వేడుకలు సత్తుపల్లి టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ యూనియన్ నాయకులు హబీబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు మదీనాభాషా, మండల అధ్యక్షులు ఎండీ ఆయాసీర్, మాజీ అధ్యక్షులు ఏదులాపురం వెంకటేశ్వరరావు, డీఎస్ చారి, సుబ్బారావు, వెంకటాచారి, భూషణం, చారి, వైఎస్ రావు, నాగేశ్వరరావు, సుజాతాచారి పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌కు సొంతగూడెన్నడో..



అద్దె భవనంలో కొనసాగుతున్న సత్తుపల్లి ఎక్సైజ్‌శాఖ కార్యాలయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఏటా కోట్లాది రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వానికి ఇస్తున్నా.. ఈ శాఖకు సొంత భవనం లేకపోవటంతో అద్దె భవనంలోనే అరకొర వసతులతో నెట్టుకొస్తుంది. ఇకనైనా ప్రభుత్వం ఈ కార్యాలయానికి సొంత భవనం మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాలాభిషేకాలు.. పుష్పాభిషేకాలు



సత్తుపల్లిరూరల్: ప్రజాప్రతినిధులకు పాలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు



కల్లూరురూరల్: ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తల్లాడ/సత్తుపల్లిరూరల్/వేంసూరు/కల్లూరురూరల్: మండలాల్లోని పలు గ్రామాల సౌలభ్యం కోసం బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చిత్రపటాలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు మోటార్ సైకిళ్ల ర్యాలీలతో పాటు పాలాభిషేకాలు, పుష్పాభిషేకాలు చేశారు. ఈ క్రమంలో తల్లాడ మండలంలోని నారాయణపురం నుంచి కొడవటిమెట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.50 కోట్లు మంజూరు చేయడం పట్ల సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చిత్రపటాలకు పాలాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వైరా ఏఎంసీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, జోన్ చైర్మన్లు దగ్గుల శ్రీనివాసరెడ్డి, బద్దం కోటిరెడ్డి, జీవీఆర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్తుపల్లిరూరల్ మండలంలోని సదాశివునిపేటలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షలు, సిద్ధారం-మర్లపాడు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.40 కోట్లు, గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయటం పట్ల గ్రామస్తులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సండ్రల చిత్రపటాలకు సర్పంచ్ తుంబూరు సరస్వతి, నాయకులు, ఈజీఎస్ కూలీలు, కార్యకర్తలు పాలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుంబూరు సరస్వతి, ఉప సర్పంచ్ కాలినేని వెంకటేశ్వరరావు, ఎం.సూర్యప్రకాశ్‌రెడ్డి, వెంకట్రామయ్య, టి.దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సత్తుపల్లి మండలం సిద్ధారం నుంచి వేంసూరు మండలం మర్లపాడు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేయించడం పట్ల మండల పరిషత్ కార్యలయం వద్ద మంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అంతేకాక కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామంలో ఆర్లపాడు బీటీ రోడ్డుకు రూ.4.70 కోట్లు నిధులు మంజూరు చేయటం పట్ల సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సండ్ర ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ నామారాధమ్మ, చావా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.